సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



అమ్మవారి క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ 8లో



సాగరదుర్గను చూసొద్దామా..

సాగర దుర్గ ఆలయానికి వెళ్లాలంటే సాగరాన్ని దాటాల్సి ఉంటుంది. ఈ మేరకు బోటు సౌకర్యం ఏర్పాటుచేశారు. 8లో



ఆధిక్యంలోకి అంగద్

వైజాగ్ ఓపెన్ 2024 గోల్ఫ్ టోర్నీ రెండో రౌండ్‌లో అంగద్ చీమా అగ్రస్థానానికి చేరుకున్నాడు. 8లో

న్యూస్‌రీల్

మిజోరం గవర్నర్‌ను కలిసిన నాగార్జున



మిజోరం గవర్నర్‌తో నాగార్జున

బీచ్‌రోడ్డు: అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న మిజోరం గవర్నర్ కె.హరిబాబును దసపల్లా హిల్స్ లోని ఆయన నివాసంలో గురువారం సినీ నటుడు నాగార్జున కలిశారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పలు విషయాలు చర్చించారు. ఆయన వెంట యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఉన్నారు. 10 రోజుల పాటు విశాఖలో ఓ సినిమా షూటింగ్ ముగించుకుని గురువారం హైదరాబాద్ పయనమైన నాగార్జునను అభిమానులు కలిసి ఫొటోలు దిగారు.

టెట్ పరీక్ష కేంద్రాల పరిశీలన



బుచ్చిరాజుపాలెంలోని కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కేంద్రాలను గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సందర్శించారు. ఈ పరీక్ష కోసం జిల్లాలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏమైనా లోటు పాట్లు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించారు. ఈ పర్యటనలో డీఈవో చంద్రకళ ఉన్నారు.

రిజర్వాయర్లలో పూర్తిస్థాయి నీటి నిల్వలు



ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టిన సుగుణాకరరావు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలోని రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయని జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) శంబంగి సుగుణాకరరావు తెలిపారు. విశాఖ జలవనరుల శాఖ ఎస్‌ఈగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఈగా పని చేసిన సూర్యకుమార్ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఎంతో కీలకమైన ఎస్‌ఈ పోస్టు భర్తీలో జాప్యం జరిగింది. అప్పటి నుంచి ఈ పోస్టులో ఎవరినీ నియమించకపోగా.. ఇన్‌చార్జి కూడా ఇవ్వలేదు. ఎట్టకేలకు తోటపల్లి రిజర్వాయర్(విజయనగరం) ఎస్‌ఈగా పని చేస్తున్న శంబంగి సుగుణాకరరావును బదిలీపై ఇక్కడకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖలోని రిజర్వాయర్లలో నీటిమట్టం సామర్థ్యానికి మించి ఉంటే గేట్లు ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు నీటి ఇబ్బందులు లేవని, రూ.15 కోట్లతో 295 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు వెల్లడించారు.

జపాన్ ఇన్ఫర్మేషన్ కేంద్రం డైరెక్టర్‌గా చల్లా రామకృష్ణ



రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య రామకృష్ణ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ జపాన్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య చల్లా రామకృష్ణ నియమితులయ్యారు. అలాగే ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం కో–ఆర్డినేటర్‌గా కూడా ఆయన వ్యవహరించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు నుంచి గురువారం ఆయన ఉత్తర్వులు స్వీకరించారు. జపాన్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ ద్వారా ఆ దేశంలోని విశ్వవిద్యాలయాలతో సంబంధాలు, జపాన్ సంస్కృతి, భాషా నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలు, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ సాఫ్ట్ స్కిల్స్‌పై డిప్లమో కోర్సుల నిర్వహణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

5, 6 తేదీల్లో బస్సు పాస్ జారీ నిలిపివేత

డాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు పాస్ కౌంటర్లు ఈ నెల 5, 6 తేదీల్లో తెరుచుకోవని ప్రజా రవాణాధికారి ఎ.అప్పలరాజు తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌ను ఆధునికీకరిస్తుండటంతో ఆ రెండు రోజులు బస్‌పాస్‌ల జారీని నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. 7 నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు.

సిండికేట్లకు సాష్టాంగం



ఇద్దరు లిక్కర్ కింగ్‌ల సేవలో తరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- గిరాకీ ఉన్న ప్రాంతాల్లో మద్యం షాపుల లైసెన్సులపై కన్ను
- లాటరీకి ముందే జోరుగా తెరవెనుక వ్యవహారాలు
- 70 షాపుల కోసం 500 దరఖాస్తులు వేయాలని నిర్ణయం?
- ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్న షాపుల ముందస్తు బుకింగ్?

విశాఖ సిటీ: మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు లిక్కర్ కింగ్‌లు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అన్ని అస్త్రాలతో తెరవెనుక తతంగాన్ని నడిపిస్తున్నారు. ప్రధానంగా ఇద్దరు సిండికేట్లు నగరంలో కీలక మద్యం షాపులను సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి కొంత మంది ఎక్సైజ్ అధికారులు సైతం శక్తి వంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తున్నారు. కూటమి ఎమ్మెల్యే కనుసన్నల్లో నడిచే సిండికేట్‌కు సాగిలా పడుతూ.. షాపుల ఏర్పాటుకు సైతం తోడ్పాటు అందించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే.. లాటరీకి ముందే కొంత మంది అధికారుల సాయంతో షాపుల లీజులకు ప్రయత్నాలు చేస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

చక్రం తిప్పుతున్న ఇద్దరు సిండికేట్లు

2019 వరకు జిల్లాలో మద్యం వ్యాపారాన్ని ముగ్గురు సిండికేట్లే శాసించేవారు. కానీ ఇప్పుడు ముగ్గురు సిండికేట్లలో కొంత చీలికలు వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇద్దరు సిండికేట్లు మాత్రం ఈ దఫా జిల్లాలో చక్రం తిప్పాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఒక సిండికేట్‌కు కూటమి ఎమ్మెల్యే ఆశీర్వాదాలు పుష్కలంగా ఉండడంతో ఈసారి వీరి హవా ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నట్లు లిక్కర్ వ్యాపార వర్గాల్లో టాక్ నడుస్తోంది. వీరు నగరంలో ప్రధాన ప్రాంతాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. విశాఖ జిల్లాలో 155 మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో అత్యధికంగా వ్యాపారం జరిగే ఏరియాలను ఇప్పటికే గుర్తించి వాటిని దక్కించుకోవడానికి పెద్ద ఎత్తున దరఖాస్తులు చేయించే పనిలో ఉన్నారు. ప్రధానంగా 70 షాపులను చేజిక్కించుకోడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటి కోసం 500 దరఖాస్తులు వేయాలని నిర్ణయించినట్లు చర్చ జరుగుతోంది.

షాపుల బుకింగ్‌కు అధికారులే రాయబారం

లిక్కర్ కింగ్‌లు లాటరీకి ముందే షాపులు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. తప్పనిసరిగా వారికే లైసెన్సు వస్తుందన్న గట్టి నమ్మకంతో షాపుల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న షాపులనే లీజులకు తీసుకోవాలని భావిస్తున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయితే ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను ఖాళీ చేయనున్నారు. దీంతో వాటిని తిరిగి లీజుకు తీసుకొని నిర్వహించాలని సిండికేట్‌లు భావిస్తున్నారు. ఇందుకోసం నేరుగా కొంత మంది ఎక్సైజ్ అధికారులే రంగంలోకి దిగారు. ఇప్పటి వరకు నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల యజమానులతో సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు పరిచయముంది. దీంతో వీరి ద్వారా సదరు షాపుల యజమానులతో సంప్రదింపులు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సిండికేట్‌లో కొంతమందిని తీసుకువెళ్లి ఆయా షాపులను వారికి లీజుకు ఇవ్వాలని అధికారులు రాయబారం చేస్తున్నట్లు సమాచారం. ఇలా ఇప్పటికే 70 షాపులకు సంబంధించి లీజు ఒప్పందాలకు సిద్ధమవుతున్నట్లు చర్చ జరుగుతోంది. ముందుందు ఈ మద్యం షాపుల కేటాయింపులో మరెన్ని విచిత్రాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి మరి.

పాతికిచ్చి.. పదోన్నతిపై వచ్చి?

- గృహనిర్మాణ శాఖలో అడ్డగోలు పదోన్నతి
- ఈఈ స్థాయి ఉద్యోగికి ఉన్నతాధికారిగా పోస్టింగ్
- పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వ్యవహారంలో అతని అవినీతిపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ
- కూటమి ఎమ్మెల్యేలకు రూ.25లక్షలు ముడుపులు చెల్లించినట్లుగా ఆరోపణలు



సాక్షి, విశాఖపట్నం: కూటమి నేతల సిఫార్సులు.. దండిగా డబ్బులు ఉంటే చాలు.. అర్హత లేకున్నా అందలమెక్కవచ్చు. ఆరోపణలున్నా.. అవినీతిపై విచారణలు ఎదుర్కొంటున్నా.. అడ్డగోలు పదోన్నతులు పొందవచ్చు. ఎందుకంటే పాతిక లచ్చలు ఇచ్చారుగా మరి.! ఇటీవల జరిగిన బదిలీల్లో కూటమి ఎమ్మెల్యేలకు భారీగా ముడుపులు అందాయనడానికి ఇదో ఉదాహరణ. భారీగా ముడుపులిచ్చిన ఓ అధికారికి విశాఖలో గృహ నిర్మాణశాఖను ఏలేందుకు పెద్ద పోస్టే దక్కింది. అది కూడా పదోన్నతిపై. వాస్తవానికి ఆ పోస్టుకి ఆ ఉద్యోగి పూర్తిగా అనర్హుడు. తొలుత గృహ నిర్మాణ శాఖలో ఏఈగా చేరిన ఆయన తర్వాత డీఈగా బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈఈగా పదోన్నతి వచ్చేసింది. ఇక కీలక కుర్చీలో కూర్చోవాలని బుద్ధి పుట్టిన ఆ అధికారి.. బేరసారాలు కుదరడంతో ఎమ్మెల్యేలు జీహుజూర్ అన్నారు. దీంతో అనుకున్న కుర్చీ దక్కింది. ఎలాంటి అర్హత లేకపోయినా.. ఉన్నతాధికారిగా చెలామణి అవుతున్న ఆ అధికారి వ్యవహార శైలి ఇప్పుడు ఆ శాఖలో కాక పుట్టిస్తోంది.

అర్హత లేకున్నా.. కీలక పోస్టా?

వాస్తవానికి గృహ నిర్మాణ శాఖలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కే ఉన్నతాధికారి హోదాని అప్పగించాలి. కానీ జిల్లాలో పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. సదరు ఉద్యోగి డిప్లమో చేసి ఉద్యోగం సాధించారు. క్రమంగా ఏఈ నుంచి డీఈగా.. ఇప్పుడు ఈఈగా పదోన్నతి పొందారు. సిఫార్సులతో ఏకంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ)గా బాధ్యతలు దక్కించుకున్నారు. ఈ క్రమంలో గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారిగా బదిలీపై ఇక్కడకు వచ్చేశారు. వాస్తవానికి డిప్లమోతో విధుల్లోకి చేరిన ఉద్యోగి ఉన్నతాధికారి పోస్టుకు పూర్తిగా అనర్హులు. కానీ అతనికి ప్రభుత్వం అధికారికంగా ఇన్‌చార్జి ఎస్ఈగా పదోన్నతి కల్పించేసి.. కీలక బాధ్యతలు కట్టబెట్టడం గమనార్హం. ఇందుకోసం కూటమి ఎమ్మెల్యేలకు ఏకంగా రూ.25 లక్షలు ముడుపులు చెల్లించుకున్నారని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ గుసగుసలాడుకుంటోంది.

అవినీతి అధికారికి కీలక బాధ్యతలా?

సదరు అధికారిపై మొదటి నుంచి తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వ్యవహారంలో అతను రూ.3 కోట్ల వరకు అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ విచారణ సాగుతోంది. డీఈ హోదాలో ఉన్నప్పుడే ఈ తతంగాన్ని నడిపించారు. అలాగే భీమిలిలో హౌసింగ్ విభాగంలో విధులు నిర్వర్తించిన సమయంలోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇలా పనిచేసిన చోట్ల అవినీతి వ్యవహారాలు నడిపిన వ్యక్తికి.. ఇప్పుడు కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేటి నుంచి గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ గిరినాథ్

మహారాణిపేట: పేగు తదితర సంబంధిత వ్యాధులపై విశాఖ వేదికగా ఈ నెల 4, 5, 6 తేదీల్లో ది వైజాగ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ క్లబ్ అసోసియేషన్, కోలైటా అండ్ కార్న్స్ ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఎనిమిదో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు చైర్మన్, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి ఎల్.ఆర్.ఎస్.గిరినాథ్ తెలిపారు. గురువారం సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేగుపూత జబ్బులపై వైద్యులు, వైద్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాలతో పాటు బ్రిక్స్ నుంచి కూడా పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు హాజరవుతున్నారన్నారు. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, రష్యా, చైనా, సౌతాఫ్రికా, నేపాల్ తదితర దేశాల వైద్యులు కూడా ఈ చర్చలో పాల్గొంటారని తెలిపారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆచంట చలపతి మాట్లాడుతూ పేగుపూత అనేది దీర్ఘకాలిక వ్యాధిని, గతంలో అమెరికా, యూరప్ దేశాల్లో ఉండేదని ప్రస్తుతం అంతటా బాగా పెరిగిందన్నారు. సమావేశంలో కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

ఎంవీపీకాలనీ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విశాఖ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.విజయలక్ష్మి తెలిపారు. గురువారం విశాఖ మానసిక ఆసుపత్రిలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ విశాఖ సైకియాట్రిక్ సొసైటీ, విశాఖ మానసిక ఆసుపత్రి సంయుక్తంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పని ప్రదేశంలో ఒత్తిడిలేని మానసిక ఆరోగ్యం థీమ్‌తో ఈ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న ప్రత్యేక సదస్సు జరుగుతుందన్నారు. విశాఖ మానసిక ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ పనిప్రదేశాల్లో ప్రతి వంద మందిలో 10 నుంచి 12 మంది మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ ప్రసన్నకుమార్, ఆసుపత్రి విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న టమాటా



- రైతుబజార్లలో కిలో టమాటా రూ.66
- బహిరంగ మార్కెట్‌లో రూ.80పై మాటే
- రాయితీపై విక్రయించాలని ప్రజల విజ్ఞప్తి

సీతమ్మధార: నిత్యావసర సరకుల్లో ఒకటైన టమాటా సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. రోజురోజుకు టమాటా ధరలు పెరుగుతూ భారంగా మారుతున్నాయి. గురువారం నాటికి రైతుబజార్లలో కిలో టమాటా ధర రూ.66కు చేరుకోవడం గమనార్హం. వారం కిందట కిలో ధర రూ.44గా ఉండగా.. ఇప్పుడు కిలోకి రూ.22 పెరిగి దడ పుట్టిస్తోంది. ఇదే ధరలు కొనసాగితే టమాటాకు టాటా చెప్పాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని 13 బజార్లకు రోజుకు 20 టన్నుల టమాటా అవసరం. అయితే ప్రస్తుతం 12 నుంచి 15 టన్నులు మాత్రమే వస్తోంది. ఎంవీపీకాలనీ, సీతమ్మధార, కంచరపాలెం, గోపాలపట్నం తదితర బజార్లలో అధికంగా టమాటా విక్రయాలు జరుగుతున్నాయి. విశాఖ జిల్లాలో పెందుర్తి, ఆనందపురం, పద్మనాభం, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, సబ్బవరం, రావికమతం, మాకవరపాలెం తదితర మండలాల్లో టమాటా సాగవుతోంది. స్థానిక పంట డిసెంబర్‌కు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం మదనపల్లి, గుర్రపుకొండ, పలమనేరు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి విశాఖకు టమాటా దిగుమతి అవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు టమాటా పంట కొంత వరకు పాడవడం, రవాణా చార్జీల కారణంగా ధరలు పెరుగుతున్నాయని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్లే ధరలు పెరుగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. గతంలో సెంచరీ దాటిన టమాటా.. ఇప్పుడు మళ్లీ ఆ దిశగా పయనిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ధర ఎక్కువగా ఉన్న కారణంగా వినియోగదారులు కిలో బదులు అర కిలో లేదా పావు కిలో కొనుగోలు చేస్తున్నారు. కొన్ని బజార్లలో టమాటా స్టాళ్ల వద్ద వినియోగదారులు క్యూల్లో నిల్చోవడం కనిపించింది. ఇక బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.80 నుంచి రూ.90 వంతున విక్రయిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ రోజూ వంటల్లో టమాటాను తప్పనిసరిగా వాడతారు. అందుకే టమాటాకు అంత డిమాండ్. హోటళ్లు, పార్లర్లు, రెస్టారెంట్లు కూడా టమాటా కోసం రైతుబజార్లకు వస్తుంటారు. వీరు రోజూ పది నుంచి 20 కిలోల చొప్పున కొనుగోలు చేస్తారు. టమాటా ధరల నియంత్రణకు జిల్లా పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

రాయితీపై విక్రయించాలి



రైతుబజార్లలో టమాటా ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో ధర రూ.66గా ఉంది. బహిరంగ మార్కెట్‌లో రూ.90 పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాయితీ ధరకు టమాటా విక్రయించేలా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలి.

– ఈ.కావ్య, నక్కవానిపాలెం

టమాటా కొనలేకపోతున్నాం



గతంలో వారానికి రెండు కిలోల టమాటా కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం ధరలు చూసి అర కిలో లేదా పావు కిలోతో సరిపెట్టుకుంటున్నాం. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి టమాటా ధరలు నియంత్రించాలి. రాయితీపై టమాటాలు విక్రయించాలి.

– కె.సత్యవతి, నక్కవానిపాలెం

‘నిఘా’ నేత్రాలు పటిష్టం

- నేరాలు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- నగరంలో కొత్తగా 12,500 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు
- జీవీఎంసీ ద్వారా సమీకరణకు చర్యలు
- ప్రస్తుతం 6,387 సీసీ కెమెరాలు.. వీటిలో పనిచేయనివి 1308..



విశాఖ సిటీ : శాంతి భద్రతల పరిరక్షణ.. నేరాల నియంత్రణ.. కేసుల దర్యాప్తు.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ.. నిందితుల పట్టివేత.. ఇలా ప్రతి విషయంలోను కీలకంగా ఉండే నిఘా కెమెరాలపై నగర పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో నిఘా నేత్రాలను పటిష్టం చేసేందుకు సిద్ధమవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా నగరంలో వేల సంఖ్యలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చొరవతో జిల్లాలో ప్రస్తుతమున్న 6,387 కెమెరాలతో పాటు అదనంగా మరో 12,500 సీసీ కెమెరాలను అమర్చాలని నిర్ణయించారు. జీవీఎంసీ సహకారంతో వీటిని ఏర్పాటు చేసి.. నగరంలో ప్రతి ప్రాంతాన్ని కమిషనరేట్ నుంచే పర్యవేక్షించే వ్యవస్థను తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.

నేర పరిశోధనలో కీలకం

నేరాల నియంత్రణతో పాటు నేర పరిశోధనలోను, నిందితుల పట్టివేతలోను సీసీ కెమెరాల పాత్రే ప్రధానంగా మారింది. ప్రస్తుతం 90 శాతం కేసులు ఈ నిఘా కెమెరాల ద్వారానే పరిష్కారమవుతున్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దీంతో నగరంలో ఈ సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలని సీపీ నిర్ణయించారు. మరోవైపు ప్రస్తుతమున్న సీసీ కెమెరాల పరిస్థితిని పరిశీలించారు. పనిచేయని వాటిని వెంటనే మరమ్మతు చేయించాలని, లేనిపక్షంలో వాటి స్థానంలో కొత్త కెమెరాలను అమర్చాలని ఆదేశాలు జారీ చేశారు. మూడు నెలల క్రితం వరకు నగరంలో మ్యాట్రిక్స్‌కు సంబంధించి 1620 కెమెరాలు, ఎల్ అండ్ టీకి సంబంధించి 592, జీ20వి 155 కెమెరాలు ఉన్నాయి.

3 నెలల్లో 4,020 సీసీ కెమెరాలు ఏర్పాటు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో పోలీసులు సీసీ కెమెరాల పరిస్థితిని పరిశీలించారు. మూడు నెలల క్రితం వరకు నగరంలో 2,367 నిఘా కెమెరాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 1,059 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన 1,308 మరమ్మతుకు గురయ్యాయి. పాడైన వాటిలో 400 కెమెరాలు సరిచేసి మళ్లీ అమర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సీసీ కెమెరాల సంఖ్యను గణనీయంగా పెంచాలని సీపీ నిర్ణయించారు. దీంతో ఇటీవల కొత్తగా 4,020 సీసీ కెమెరాలు అమర్చారు. ప్రస్తుతం 6,387 కెమెరాలు ఉండగా.. వాటిలో 1308 పనిచేయడం లేదు. ఇందులో 400 కెమెరాలు వారం రోజుల్లోనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

12,500 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు





నగరంలోనే కాకుండా, శివారు ప్రాంతాల్లో సైతం ప్రజలు వెళ్లగలిగే అన్ని చోట్లా ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు గట్టి నిర్ణయంతో ఉన్నారు. ఫలితంగా నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం మరో 12,500 నిఘా కెమెరాలు అవసరమని పోలీసుల నిర్ధారణకు వచ్చారు. వాటి కోసం సీపీ శంఖబ్రత బాగ్చి ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో చర్చించారు. ఆ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ కూడా అంగీకరించారు. ఇవి అందుబాటులోకి వచ్చిన వెంటనే అమర్చాలని భావిస్తున్నారు. తద్వారా నగరమంతా నిఘా నేత్రాల్లో నిక్షిప్తం కానుంది.

ఆదాయం పెంచుకోవడానికే కొత్త ఎక్సైజ్ పాలసీ

- మద్యం అమ్మకాల్లో 30 శాతం తగ్గుదల దిశగా పాలసీ ఉండాలి
- విక్రయాల్లో వ్యక్తిగత పరిమితిని ప్రవేశపెట్టాలి
- సీఎం చంద్రబాబుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ

సాక్షి, విశాఖపట్నం: కేవలం ప్రభుత్వాదాయం పెంచుకోవడానికే అన్నట్టుగా కొత్త ఎక్సైజ్ పాలసీ రూపొందించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వ్యాఖ్యానించారు. కొత్త మద్యం విధానంపై స్పందిస్తూ.. సీఎం చంద్రబాబుకు గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కొత్త పాలసీలో యువత, మహిళల సంక్షేమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత కనిపించలేదని, కేవలం ఖజానాలో డబ్బులు నింపేలా మద్యం విధానాన్ని రూపొందించినట్టు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. టీడీపీ–జనసేన 2024 ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం యువత, మహిళా సంక్షేమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత కొత్త విధానంలో కనిపించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర సమాజ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2018–19లో చేసిన సర్వే ప్రకారం.. మన రాష్ట్ర జనాభాలో 6 శాతం మంది మద్యానికి పూర్తిగా బానిసలుగా మారి వ్యాధుల బారిన పడ్డారని తేల్చిందన్నారు. జాతీయ స్థాయిలో అధికంగా మద్యపానానికి ప్రభావితమైన రాష్ట్రాల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఓ వైపు రాష్ట్ర ఆదాయం పెరిగినా.. మద్యం కారణంగా రాష్ట్రంలో లక్షలాది చిన్న కుటుంబాలు నష్టపోతాయని, దీనిపై దృష్టి సారించకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు.

మద్యానికి బానిసలవడం వల్ల మహిళల మీద అత్యాచారాలు కూడా పెరుగుతున్నాయని, కుటుంబ ఆదాయం తగ్గి, పిల్లల చదువులకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. మద్యం అమ్మకాల్లో 30 శాతం తగ్గుదల దిశగా పాలసీ ఉండాలే తప్ప.. ఖజానా నింపేసుకునేందుకు కాదన్నారు. విక్రయాల్లోనూ వ్యక్తిగత పరిమితిని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొత్త విధానంపై రాష్ట్రంలో మహిళా సంఘాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం పాలసీలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని శర్మ తన లేఖలో స్పష్టం చేశారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. నగరంలో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తుపదార్థాల నియంత్రణ కోసం నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)కు చెందిన నలుగురి అధికారులతో విశాఖకు చెందిన 50 పోలీసులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా నగరంలో డ్రగ్స్ కట్టడికి ఎన్‌సీబీ అధికారులు 5 డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌ను సీపీ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ పోలీసులకు ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరంలో డ్రగ్స్, గంజాయిని పూర్తిగా నిర్వీర్యం చేయాలని సూచించారు. ఆ వ్యాపారం చేసే వారు జైలులో ఉండాలని, లేదంటే దేశం వదిలి పారిపోవడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని స్టేషన్లకు డ్రగ్ డిటెక్షన్ కిట్లను అందజేస్తామని వెల్లడించారు.



దుర్గాదేవి వేషధారి ఉగ్రరూపం



రామ్‌నగర్‌లో వైభవంగా దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



వన్‌టౌన్‌లో పూజలందుకుంటున్న అమ్మవారు

అమ్మవారి క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

బీచ్‌రోడ్డు: నగరంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని పలు వీధుల్లో భక్తులు మండపాలు ఏర్పాటు చేసి.. దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. తొలి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రామ్‌నగర్ గ్రామదేవత దుర్గా మల్లేశ్వరి ఆలయంలో ఉత్సవాలు కనులపండువగా సాగాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు వీధుల్లో ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు. మహిళలు కలశాలు పట్టుకుని మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నగరంలోని పలు ఆలయాల్లో కుంకుమ పూజలు జరిగాయి.







ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు

హేతుబద్ధతపై రేషన్ డీలర్లకు నోటీసులు

మహారాణిపేట: రేషన్ కార్డుల హేతుబద్ధతపై కోర్టు ఆదేశాల ప్రకారం జిల్లాలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో 800 కార్డుల దాటిన డిపోల వివరాలతోపాటు ఆ డీలర్ అభిప్రాయం కూడా సేకరించేందుకు పౌరసరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రకారం జిల్లాలో 268 మంది డీలర్లు ఉన్నట్టు గుర్తించారు. వారికి నోటీసులు ఇచ్చి వారి అభిప్రాయలు తెలుసుకుంటామని అధికారులు చెబుతున్నారు. పలు రేషన్ డిపోల్లో 400 నుంచి 2,000 రేషన్ కార్డులు ఉన్నాయి. దీంతో రేషనలైజేషన్ కోసం ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రకారం మరో 68 రేషన్ డిపోలు కొత్తవి ఏర్పాటు చేయాలని భావించారు. అయితే కొత్త రేషన్ డిపోలు ఏర్పాటు వద్దని.. పాత డిపోల వారికే కార్డులన్ని సమానంగా పంచాలని, ఒక్కొక్క డిపోకు 840 కార్డులు చొప్పన ఉంచాలని డీలర్ల సంఘాలు కోరాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి వినతులు అందించాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూలత రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాల మేరకు 800 రేషన్ కార్డుల దాటిన డిపోల వివరాలతోపాటు డీలర్లకు నోటీసు ఇచ్చి వారి అభిప్రాయం తెలుసుకోవాలని ఆదేశించింది. ఈ ప్రకారం డీలర్లకు నోటీసులు జారీ చేస్తున్నారు.

VEHICLE FOR SALE

Vehicle no.	Make	Model
AP39UP6887	MARUTI DZIRE	2015
AP35TB1355	HYUNDAI XCENT	2018

Contact: 9849981250
SHRIRAM FINANCE LIMITED

రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 90 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాలు, ఇతర అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. లే అవుట్ల వారీగా చేపట్టిన చర్యలపై సమీక్షించిన కలెక్టర్.. అక్కడ చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో కలిపి రోజుకు 700 స్టేజ్ కన్వర్షన్ జరగాలని, 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించారు. క్షేత్రస్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలన్నారు. సాంకేతిక సమస్యలను అధిగమించాలని, జియో ట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎమినిటీస్ సెక్రటరీలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాస్, ఈఈ రమణమూర్తి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చేపట్టిన పనులను వేగవంతం చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంలో గురువారం ఆయన వీఎంఆర్‌డీఏ చేపట్టిన నిర్మాణాలను, భూములను సందర్శించారు. ముందుగా వేపగుంట ప్రాంతంలో ఉన్న చీమలాపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రెండు అంతస్తుల కన్వెన్షన్ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. మార్పులు చేర్పులు సూచించి, పనులను వేగవంతం చేయాలని చెప్పారు. అనంతరం పెదగంట్యాడలో ఓపెన్ ఆడిటోరియం, కేఎల్ రావు నగర్, కూర్మన్నపాలెం, అగనంపూడి వద్ద సంస్థకు చెందిన భూములను పరిశీలించారు. అలాగే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో కలిసి మాడుగులలో అభివృద్ధికి అవకాశమున్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ పర్యటనలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి శిల్పా, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కన్వెన్షన్ సెంటర్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

యారాడ కొండకు వెళ్దామా..

- సాగరగిరి కనక దుర్గమ్మను చూసొద్దామా..
- నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో సాగర గిరి దుర్గమ్మ

అల్లిపురం: యారాడ కొండ(డాల్ఫిన్ నోస్)పై దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాగర గిరి కనక దుర్గమ్మ ఆలయంలో గురువారం ఉదయం 9 గంటలకు కలశ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. 4న గాయత్రీ దేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న భువనేశ్వరీ దేవిగా, 7న లలితాదేవిగా, 8న సరస్వతీ దేవిగా, 9న మహాకాళీదేవిగా, 10న శాకంబరీ దేవిగా, 11వ చండీదేవిగా, 12న సాగరగిరి కనక దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

భక్తుల దర్శనార్థం బోటు సౌకర్యం

సాగర గిరి కనకదుర్గ ఆలయానికి వెళ్లాలంటే సాగరాన్ని దాటాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పోర్టు అథారిటీ అనుమతితో బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు బోటు యజమాని గుప్తా తెలిపారు. ప్రతి రోజూ పాతపోస్టాఫీసు దరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గల ఫెర్రీ నుంచి ఉదయం 7 గంటలకు బోటు ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటల వరకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 టికెట్టుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫెర్రీ నుంచి ఆలయం వరకు, ఆలయం నుంచి ఉచిత ఆటో సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



సాగరి గిరి దుర్గమ్మ కొలువైన యారాడ కొండ

శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. పీఠంలోని స్వర్ణ మండపంలో కొలువైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. బాలత్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి స్వామీజీ పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమ పూజలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సువాసిని పూజ జరిగింది. ఏకదశ హరతులు ఇచ్చారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీ

గత పోరాటాల స్ఫూర్తితో 'ఉక్కు'ను రక్షించుకుందాం

మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

సీతమ్మధార: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాకంటక నిర్ణయాలపై పోరాడి విజయం సాధించిన చరిత్ర ఉత్తరాంధ్రదని.. ఆ స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకుందామని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఉక్కు పరిరక్షణ దీక్షలో మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, గిరిజనులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'ఏజెన్సీలో బాక్సైట్ నిక్షేపాల తవ్వకాలను నిలువరించగలిగాం. ప్రైవేట్ విద్యుత్ థర్మల్ ప్లాంట్లు రాకుండా అడ్డుకున్నాం. హిందూస్తాన్ షిప్‌యార్డ్‌ను రక్షణ రంగంలో, బీహెచ్‌పీవీని బీహెచ్‌ఈఎల్‌లో విలీనం చేయించుకున్నాం. ఇలా ఎన్నో అంశాల్లో విజయం చరిత్ర మన ఉత్తరాంధ్రకు ఉంది. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని శర్మ అన్నారు. రాష్ట్రానికే కీలక పరిశ్రమ అయిన స్టీల్‌ప్లాంట్ రక్షించాల్సిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఇప్పుడు మోదీని నిలదీయడానికి సిద్ధంగా లేరని దుయ్యబట్టారు. స్టీల్‌ప్లాంట్, హామీల అంశాలు పక్కదారి పట్టించే విధంగా లడ్డూ సమస్యను ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. వీరు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడలేకపోతే.. రాష్ట్రంలో ఏదీ సాధించలేరని మండిపడ్డారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.ఎ.బేగం అధ్యక్షతన జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరావు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి వెంకయ్య, పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.అప్పారావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, కె.వనజాక్షి, జిల్లా కార్మిక ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మథరావు తదితరులు మాట్లాడారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జె.అచ్యుతరావు, నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, పి.మణి, బి.జగన్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు అన్నపూర్ణ, దేవుడమ్మ, అరుణ, ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, కె.మణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME and DATE OF BIRTH
I, M. VEERANJANEYULU, Rank: SEP, Army No. 10329537-X, S/o. M. BALAIAH, Present serving at SBC, Naval Base (Post) Visakhapatnam-530014, Andhra Pradesh, Hereby declare that in my Army Service Records my wife's Name & Date of Birth was wrongly mentioned as M ESWARAMMA and Date of Birth as 17-08-1981 instead of correct name MAYALURI ESWARAMMA and correct Date of Birth is 10-02-1985. Vide affidavit dated 17-08-2024 sworn before Notary at Visakhapatnam.

Education

■ A.P. ఓపెన్ స్కూల్ 10th, 12th, ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల నుండి B.A. B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA లకు పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 99668 48898 [V- 786941]

Real Estate

FLAT FOR SALE
■ SABBAVARAM, 2BHK Flats for Sale, Per SFT 2950/- Ph:77998 56857 [V- 2772]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185462]

■ సెక్యూరిటీ గార్డ్స్ జీ:11,000, మధురవాడలో కూర్మన్నపాలెంలో ఆఫీస్‌బాయ్ & ప్యాకింగ్ హెల్పర్ & ఫీల్డ్‌మేనేజర్10,000,4Week of PF, ESI బజాజ్ షోరూంVSPకావలెను.8074444019,9989139239 [T-1259031]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 7702473949 [G-9055]

■ SAI GOLDEN VENTURES R&B మెయిన్ బ్రాంచ్‌నందు పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. టెలీకాలర్స్-5, మార్కెటింగ్ ఆఫీసర్-5, అకౌంటెంట్-1, కారు డ్రైవర్-1. 18 నుంచి 35 సంవత్సరముల లోపు అనుభవం ఉన్న లేకున్నా ట్రైనింగ్ సదుపాయం కలదు. ఆకర్షణీయమైన జీతం, భోజనం, అలవెన్సు కలదు. సెల్: 8888786746, 9494459673 [S-1243280]

■ వైజాగ్ హోమ్ కేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్ళలో పనిచేయుటకు పెద్దవారిని, పేషంట్లను చూసుకోనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000-18000 ☏8121980650, 8121555087 [G-782922]

■ Wanted Marketing (Business Development Manager) for Oaks Educational Consultancy in Vizag Previous Experience in College / Client Marketing is Desirable Age Not Over 50 Graduates with Go Getter Attitude Salary Up to 40K PM Fixed pls WhatsApp your Latest CV with a Cover Letter at 9849025444 / 7382700710 for an Interview [SCA24000308]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ఆరోగ్యశ్రీ పేరిట మోసం.. ఇద్దరి అరెస్ట్

ముగ్గురి నుంచి రూ.2.83 లక్షలు కాజేసిన నిందితులు

అల్లిపురం: 'ఆరోగ్య శ్రీ నుంచి ఫోన్ చేస్తున్నాం. మీకు రావాల్సిన డబ్బులు చెల్లించడానికి కొంత ఆన్‌లైన్ ప్రాసెస్ చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి మేము పంపించిన లింక్ క్లిక్ చేస్తే నగదు మీ ఖాతాకు జమ అవుతుంది.' అంటూ ఫోన్లు చేసి నగదు కాజేసిన ముఠాను సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నగరానికి చెందిన ఒక మహిళకు 85060 59581 నంబర్‌తో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఆరోగ్యశ్రీ విభాగానికి చెందిన వ్యక్తిగా అతను పరిచయం చేసుకుని.. మీ కోడలు డెలివరీ ఖర్చులకు సంబంధించి డబ్బులు జమ చేస్తామని చెప్పాడు. ఇందు కోసం ఒక లింక్ పంపాడు. ఆ లింక్‌ను ఉపయోగించి బ్యాలెన్స్ తనిఖీ చేయమని ఆమెను కోరాడు. ఆమె ఆ లింక్‌పై క్లిక్ చేయగానే బ్యాంకు ఖాతా నుంచి రూ.26,211 కట్ అయినట్లు మేసేజ్ వచ్చింది. ఫోన్ పే యాప్ నుంచి మరోసారి బాధితురాలు చెక్ చేసుకుంటే రూ.51,201 కట్ అయినట్లు మరో మేసేజ్ వచ్చింది. ఈ మొత్తం సొమ్మును తిరిగి జమ చేస్తామని నిందితుడు మరోసారి యూపీఐని చెక్ చేసుకోమని లింక్ పంపాడు. ఈ క్రమంలో రూ.6,831 కట్ అయింది. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆమెలాగే పెద్ద నడుపూరుకి చెందిన ఎన్ని శశికళ ఖాతా నుంచి రూ.99,342, మద్దిలపాలేనికి చెందిన బోయి దివ్య ఖాతా నుంచి రూ.99,430లను కేటుగాళ్లు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో సైబర్ క్రైం పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులు వీర్నాల బాలాజీ, పూజల చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు.

స్విగ్గీ డెలివరీ బాయ్‌పై కత్తితో దాడికి యత్నం

కాపాడిన మూడో పట్టణ పోలీసులు

బీచ్‌రోడ్డు: రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న స్విగ్గీ డెలివరీ బాయ్‌పై ఓ వ్యక్తి కత్తితో దాడికి యత్నించాడు. సకాలంలో మూడో పట్టణ పోలీసులు స్పందించి బాధితుడిని రక్షించారు. వివరాలివీ.. పెదవాల్తేరు కాగితాలవీధికి చెందిన అల్లిన దయాకర్ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బుధవారం అర్ధరాత్రి మద్దిలపాలెం నుంచి పెదవాల్తేరు వెళ్తుండగా ఏయూ గ్రౌండ్స్ వద్ద కేశవ అమర్ అనే వ్యక్తి దయాకర్‌ను ఆపాడు. కత్తితో బెదిరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దయాకర్ నిరాకరించడంతో పాటు వెంటనే 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో దయాకర్‌పై కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించగా.. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు అతన్ని కాపాడారు. కేశవ అమర్‌ను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. తక్షణమే స్పందించి డెలివరీ బాయ్‌ను కాపాడిన పోలీసులను సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

ఆధిక్యంలోకి అంగద్

రెండో స్థానంలో కొనసాగుతున్న అమన్‌రాజ్

విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ ఓపెన్ 2024 గోల్ఫ్ టోర్నీ రెండో రౌండ్‌లో వ్యక్తిగత అత్యుత్తమ -10 స్కోర్, నాలుగు షాట్లతో అంగద్ చీమా అగ్రస్థానానికి చేరుకున్నాడు. రెండు రౌండ్ల లోనూ -12 స్కోర్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. గతవారం జరిగిన టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన చండీగఢ్‌కు చెందిన అంగద్ చీమాకు ఇదే వ్యక్తిగత అత్యుత్తమ స్థానం. అంగద్ ప్రస్తుత సీజన్‌లో ఆరు టాప్-10లతో పీజీటీఐ ర్యాంకింగ్‌లో నాలుగో స్థానానికి చేరాడు. విశాఖలోని ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో గురువారం రెండో రోజు జరిగిన మ్యాచ్‌ల్లో పాట్నాకు చెందిన అమన్‌రాజ్ తన రెండో రౌండ్ అనంతరం-8(134) వద్ద రెండో స్థానం, బెంగళూరుకు చెందిన ఆర్యన్ రూప ఆనంద్-7 స్కోర్‌తో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. మొత్తంగా తొలి రెండు రౌండ్లలో 126 మంది పోటీపడగా 143 వద్ద కట్ ప్రకటించడంతో 57 మంది గోల్ఫర్లు పోటీలో నిలిచి మూడో రౌండ్‌కు సిద్ధమయ్యారు. పదకొండేళ్ల క్రితం టైటిల్ సాధించిన అంగద్ ఈసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో మూడోరౌండ్‌కు సిద్ధమయ్యాడు. తొలిరౌండ్ ముగిసేటప్పటికి 13వ స్థానంలో నిలిచినా రెండో రౌండ్ ముగిసేటప్పటికి ఆధిక్యంలోకి దూసుకొచ్చాడు. తొలిరౌండ్‌లో ఆధిక్యాన్ని ప్రదర్శించిన మిలింద్ అండర్ 5 స్కోర్‌తో, ధృవ్‌తో కలిసి ఉమ్మడిగా ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. కెనడాకు చెందిన శుభ్‌రాజ్‌తో కలిసి డిఫెండింగ్ చాంప్ శ్రీలంకకు చెందిన తంగరాజ ఉమ్మడిగా 16వ స్థానంలో అండర్ 2 స్కోర్లతో కొనసాగుతున్నారు.



అమన్‌రాజ్

టమాటా, ఉల్లి ధరల నియంత్రణపై దృష్టి పెట్టండి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట: 'మార్కెట్‌లో టమాటా, ఉల్లిపాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.. వినియోగదారుల అవసరాల మేరకు నిల్వలను అందుబాటులో ఉంచాలి. ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి' అని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన.. వివిధ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఉల్లిపాయలు, టమాటా ధరలు అధికంగా ఉన్నాయని, వాటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. చిత్తూరు నుంచి టమాటాలు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుబజార్లలో ఉండే ఎస్టేట్ అధికారులు బాధ్యతగా పని చేయాలని జేసీ ఆదేశించారు. మార్కెటింగ్ ఏడీ యాసీన్, డీఎస్‌వో వి.భాస్కర్, వివిధ శాఖల అధికారులు, రైతు బజార్ల ఏవోలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్


సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: బక్కన్నపాలెంలోని దివ్యాంగులు, వయోవృద్ధుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం విచారణ చేపట్టారు. ఇక్కడ శిక్షణ పొందుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు నిర్వాహకులు సరైన భోజనం పెట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'సాక్షి'లో బుధవారం 'నీళ్లచారు.. పురుగుల అన్నం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్పందించింది. ఈ మేరకు సీతారాం ఐటీఐని పరిశీలించి.. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై వివరాలు సేకరించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించగా.. అన్నం ముద్దగా ఉందని, చారు నీళ్లలో ఉండడం వల్ల తినలేకపోతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నిర్వాహకులను హెచ్చరించారు. ఐటీఐని నిత్యం పర్యవేక్షించాలని అసిస్టెంట్ డైరెక్టర్ మాధవితోపాటు మహిళా పోలీసుకు సూచించారు. మళ్లీ ఫిర్యాదులు రాకుండా చర్యలను చేపట్టాలని, ఈ వ్యవహారంపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఏడీ మాధవిని ఆదేశించారు. ఐసీడీఎస్ పీవో శ్రీదేవి పాల్గొన్నారు. కాగా.. ఈ వ్యవహారంపై జేసీ మయూర్ అశోక్ కూడా ఆరా తీసినట్లు తెలిసింది.



బక్కన్నపాలెం వికలాంగుల, వయోవృద్ధుల టీసీ, పీసీలో విచారణ చేస్తున్న గొండు సీతారాం

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్స్

కంచరపాలెం: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు గురువారం నిర్వహించారు. పెదగంట్యాడలోని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు ఎం.రవికుమార్, పి.అప్పలరాజు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పి.వి.బాలాజీ, ఉపాధ్యక్షుడిగా కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎ.జయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా బి.సత్యనారాయణ, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, సభ్యులుగా ఐ.ఎ.వి.కుమార్, ఎ.లక్ష్మణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జె.శ్రీకాంత్, వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిబ్రూఘడ్-హుబ్బళ్లి మధ్య వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: డిబ్రూఘడ్-హుబ్బళ్లి మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిబ్రూగఢ్-హుబ్బళ్లి(05926) వన్ వే స్పెషల్ ఈ నెల 5వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి మూడో రోజు సోమవారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.10 గంటలకు బయల్దేరి నాల్గవ రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు హుబ్బళ్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 10-స్లీపర్ క్లాస్, 2-జనరల్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ క్లాస్ కమ్ లగేజీ /దివ్యాంగ కోచ్‌లతో నడుస్తుంది.

ఎస్‌సీఎస్‌ఎల్ ఎండీ ఆర్యపై సెబీ చర్యలు

ఆ సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెల్లడి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

సీతమ్మధార: విశాఖకు చెందిన స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్(ఎస్‌సీఎస్‌ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్యను నెలరోజుల పాటు విధుల నుంచి సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) సస్పెండ్ చేసిందని ఆ సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. డైమండ్ పార్కులోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెబీకి ఆర్య సమర్పించిన విద్యార్హతల సర్టిఫికెట్లన్నీ నకిలీవని స్పష్టంగా తెలియడంతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చినందుకుగానూ గతంలో ఎస్‌సీఎస్‌ఎల్, ఆర్యకి సెబీ రూ.5.25 లక్షల జరిమానా వడ్డించిందని గుర్తు చేశారు. తాజాగా కంపెనీ ఎండీ ఆర్యను నెల రోజుల పాటు విధుల నుంచి తొలగించిందన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పొందిన సర్టిఫికెట్ నకిలీదని రిజిస్ట్రార్ ధ్రువీకరించి ఆర్యపై మూడో పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారని వివరించారు. పాస్‌పోర్టు కోసం ఈ నకిలీ సర్టిఫికెట్ సమర్పించారని ఆరోపించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుతో పాస్‌పోర్టు అధికారులు చేసిన దర్యాప్తులో కూడా ఆయన సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని తేలిందన్నారు. ఎస్‌సీఎస్‌ఎల్‌లో కొన్ని లక్షల మంది ప్రజలు రూ.కోట్లలో షేర్ల రూపంలో పెట్టుబడులు పెట్టారని, ఈ వ్యవహారం కారణంగా పెట్టుబడిదారులు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు.

సెంచూరియన్‌లో ఆప్టోమెట్రీపై సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ కుమారస్వామి

నెల్లిమర్ల రూరల్: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఆప్టోమెట్రీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వామి కంటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి స్వదేశీ బ్రాండ్, ఉత్పత్తి, పరిశోధన, అభివృద్ధిని సృష్టించడం తదితర ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.